క్లుప్తంగా

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లె గ్రామ సచివాలయ పరిధిలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి బుధవారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ సుధాకరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధితో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకుంటారని చెప్పారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

కార్మికులకు అగ్నిప్రమాదాలపై అవగాహన



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నగరి : అగ్నిప్రమాద నివారణపై పట్టణ పరిధిలోని వైట్ హౌస్ ఫ్యాక్టరీలోని కార్మికులకు అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఫ్యాక్టరీకి వెళ్లిన అగ్నిమాపక అధికారులు అగ్నిప్రమాదాల నివారణ, మంటలను అదుపు చేసే ప్రక్రియలపై కార్మికులకు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి మస్తాన్, సిబ్బంది కేబీబీ ప్రతాప్, డీసీ రాజు, ప్రవీణ్‌కుమార్, విజయ్, మల్లికార్జున, ప్రకాష్, కోటేశ్వరరావు, మధు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు ఈకేవైసీ చేసుకోవాలి

నగరి : రైతులంతా తప్పనిసరిగా పీఎం కిసాన్ 14వ ఇన్‌స్టాల్‌మెంట్ ఈకేవైసీ ఈనెలాఖరులోగా చేసుకోవాలని వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పాస్‌బుక్స్ పొందిన వారు వెంటనే రైతు భరోసా సిబ్బందిని కలిసి మీ భూమి వివరాలు తెలిపి రైతు భరోసాకు నమోదు చేసుకోవాలన్నారు.

ఆలయ మాన్యం స్థలాన్ని చూపండి



డీటీ రవికుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న కిరణ్

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలం వేపగుంట క్రాస్ రోడ్డు వద్ద వినాయకస్వామి ఆలయ మాన్యంకు చెందిన 1.50 ఎకరాల భూమి కబ్జాకు గురైందని పరమేశ్వరమంగళం హరిజనవాడకు చెందిన కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన కబ్జాకు గురైన మాన్యం భూమిని సర్వే చేసి సదరు స్థలాన్ని ఆలయానికి చూపించాలని కోరుతూ మండల డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయానికి సమీపంలోని స్పిన్నింగ్ మిల్లు యాజమాన్యం గత రెండు రోజులుగా ఆలయ మాన్యం భూమికి పూర్తిగా ఫెన్సింగ్ వేయడం జరిగిందన్నారు. నేషనల్ హైవేకి సమీపంలోని విలువైన భూమిని కాపాడాలని కోరినట్లు తెలిపారు.

భూసార పరీక్షలతో పంటలకు శ్రీరామరక్ష



మట్టిని వేరు చేసే విధానాన్ని చూపిస్తున్న వ్యవసాయ అధికారులు

పాలసముద్రం : రైతులు పంట సాగు చేసే ముందు భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్షలు చేయడం వల్ల అటు భూమికి, ఇటు పంటకు శ్రీరామరక్షగా నిలుస్తాయని ఏఓ డిల్లీప్రసాద్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో రైతులకు భూసార పరీక్ష చేయడం వల్ల వచ్చే లాభాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ డిల్లీప్రసాద్ రైతులతో మాట్లాడుతూ భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయాలని, పంట సాగు చేసే ముందు ప్రతి రైతు దీనిపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పంట కోతలు ముగిసిన నెల రోజులకు మట్టి నమూనా సేకరించాలని, భూసార పరీక్ష వల్ల ఏ పంట పండించారో తెలుస్తుందన్నారు. అనంతరం రైతులకు మట్టిని వేరు చేసే విధానాన్ని చేసి చూపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, సర్పంచ్ గాలి మహేష్ బాబు, వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

గంగాధరనెల్లూరు: మండల ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ రామాంజనేయులును మంగళవారం రైతుభరోసా అడ్వైజరీ కమిటీ అధ్యక్షుడు అంబోదరపల్లి బాబురెడ్డి, మాజీ ఎంపీటీసీ శంకర్ మొదలియార్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మండలంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఎస్ఐని కోరారు.

చదువుల కోవెల.. నగరి కళాశాల

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో 1978లో ఎంజె మెహతా అనే దాత సాయంతో నగరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైంది. మొదట్లో నాలుగు కోర్సులతో మొదలైన ఈ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ పూర్తి చేసిన వారు పీజీ చేయడానికి, ఆపై పీహెచ్‌డీ, ఎంఫిల్ చేసే విధంగా రూపాంతరం చెందింది. గతంలో పీజీ స్థాయి కోర్సులకు తిరుపతి లేదా ఇతర సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. అయితే నేడు ఆ పరిస్థితి లేదు.
నగరి డిగ్రీ కళాశాలలోనే అన్నిరకాల వృత్తి, విద్యాకోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం నాక్ పీర్ బృందం పర్యటించనుంది.

- అకడమిక్ విద్యతో పాటు అదనపు కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ
- డిగ్రీ నుంచి పీజీ, పరిశోధన కేంద్రం నిర్వహించే స్థాయివరకు రూపాంతరం
- దినదినాభివృద్ధి దిశగా నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- నేడు కళాశాలకు నాక్ పీర్ బృందం రాక



నగరి : మహా నగరాల్లో లభించే వృత్తి విద్యాకోర్సులు ప్రస్తుతం నగరి డిగ్రీ కళాశాలలోనే లభిస్తుండడంతో పాటు ప్రభుత్వ సహకారం మెండుగా ఉండడంతో గ్రామీణ విద్యార్థులకు ఉన్నతస్థాయి విద్య అందుతోంది. బీఎస్సీ (ఎంపీసీ), ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, బీకాం, బీకాం (సీఏ), బీబీఏ, బీఏ(హెచ్‌ఈపీ), ఈపీసీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పీజీలో ఎంకాం కోర్సును కూడా నగరి కళాశాలలోనే అభ్యసించవచ్చు. ఏడాది క్రితం పరిశోధనా కేంద్రం కూడా నగరిలో ఏర్పాటు చేశారు. దీంతో పీహెచ్‌డీ, ఎంఫిల్ కోర్సులను కూడా విద్యార్థులు ఇక్కడే అభ్యసించే సదుపాయం కలిగింది. వీటితో పాటు ఈ ఏడాది నైపుణ్యాభివృద్ధి కోర్సులుగా టూరిజం అండ్ గైడెన్స్, ఆఫీస్ మేనేజ్‌మెంట్ కోర్సులు ప్రవేశపెట్టారు. 45 ఏళ్ల కిందట 152 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ కళాశాలలో నేడు 699 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గత ఐదేళ్లుగా కళాశాలలో ఉత్తీర్ణత 75 శాతానికి తగ్గడం లేదు. విశాలమైన ఆటస్థలం ఉండడంతో అంతర్ కళాశాల, జోనల్‌స్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభ కనబరుస్తున్నారు. దీంతో చిత్తూరు జిల్లాస్థాయిలో విద్యార్థుల సంఖ్యలో, ఉత్తీర్ణతలో రెండోస్థానంలో నిలిచి ఒక ప్రత్యేక స్థానాన్ని పొందింది. నగరి ప్రభుత్వ డిగ్రీకళాశాల, కళాశాల అధ్యయనం చేయడానికి బుధవారం నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) పీర్ బృందం పర్యటించనుంది.

అదనపు కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ

యూనివర్సిటీ నిర్దేశించిన సిలబస్ మాత్రమే కాకుండా అదనంగా సర్టిఫికెట్ కోర్సులు, బ్రిడ్జ్ కోర్సులు, రెమిడీయల్ కోచింగ్, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, సెమినార్లు, క్విజ్ పోటీలు, గ్రూప్ డిస్కషన్స్, క్షేత్రపర్యటనలు, ఐసీటీ ఆధారిత విద్యా బోధన, ఉన్నత విద్యా ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. కళాశాలలోనే జేకేసీ ద్వారా జాబ్ డ్రైవ్స్ నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. గత ఐదేళ్లలో 16 జాబ్‌మేళాల ద్వారా 245 మంది కళాశాల విద్యార్థులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయి.

విద్యార్థుల ప్రమాణాలు పెంచేలా..

విద్యా నాణ్యతను పెంపొందించే ఐక్యూఏసీ, విద్యార్థులకు క్రమశిక్షణ అందించడంతో పాటు భవిష్యత్తు ఉద్యోగ, ఉన్నత విద్యావకాశాలు పొందడానికి ఉపయోగపడే ఎన్‌సీసీ, సేవా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఎన్ఎస్ఎస్, విద్యార్థులలోని నైపుణ్యాలను వెలికితీసే జిల్లా వనరుల అభివృద్ధి కేంద్రం(డీఆర్సీ), క్రమం తప్పకుండా రక్తదానం అందించే రెడ్ రిబ్బన్ క్లబ్ (ఆర్ఆర్‌సీ), నిత్యం కళాశాలను పచ్చగా ఉంచే ఎకో క్లబ్, మహిళా సాధికారతను పెంపొందించే ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ లాంటి విభాగాలు నిర్వహిస్తున్నారు. అందుకోసం 35 మంది టీచింగ్, 15 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ ఉన్నారు. 35 మంది అధ్యాపకుల్లో 22 మంది పీహెచ్‌డీతో పాటు నెట్/ఏపీసెట్/ఎంటెక్ చేసిన వారుండడం విశేషం.

కళాశాలలోని కోర్సులు, చదివే విద్యార్థుల వివరాలు

కోర్సు	విద్యార్థుల సంఖ్య
బీఎస్సీ	
బీబీఏ	30
ఎంపీసీ	30
బీఏ	
ఎంపీసీఎస్	60
హెచ్‌ఈపీ	60
ఎంఎస్‌సీఎస్	30
ఈపీసీఏ	30
బీకాం పీజీ	
జనరల్	60
ఎంకాం	40
కంప్యూటర్ సైన్స్	100

పీజీ, పీహెచ్‌డీ, ఎంఫిల్ విద్యకు అవకాశం..

పీజీ కోర్సుల్లో భాగంగా కళాశాలలో ఎంకాం కోర్సును బోధిస్తున్నారు. అలాగే మరిన్ని పీజీ కోర్సుల నిర్వహణ కోసం ఎస్వీ యూనివర్సిటీకి ప్రతిపాదనలు పంపారు. సైన్స్, సాంకేతిక, ఉపాధి కోర్సులకు డిమాండ్ ఉంది. కళాశాలలో ఆరు జాతీయ సదస్సులు నిర్వహించారు. 98 పరిశోధనా పత్రాలు సమర్పించారు. 107 పుస్తకాలను ప్రచురించారు. ఇక్కడి విద్యార్థుల్లో ఒకరు పీహెచ్‌డీ పొందగా ఇద్దరు ఎంఫిల్ పట్టాలను సొంతం చేసుకున్నారు.

ప్రావీణ్యం పొందేలా విద్యాబోధన..



విద్యార్థులు పుస్తకాల్లోని పాఠాలతో పాటు ప్రపంచజ్ఞానం కూడా అందేలా విద్యను బోధించాలన్న దృక్పథంతో విద్యతో పాటు ఇతర కోర్సుల్లోను ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. సామాజిక బాధ్యత పెంపొందించే కార్యక్రమాల్లో, క్రీడల్లో ప్రోత్సాహం అందిస్తున్నాం. జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. జాతీయ సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రజాప్రతినిధుల సహకారం, ఉన్నత విద్యాకమిషనర్ మార్గదర్శకాల ఫలితంగానే జిల్లాస్థాయిలో 2వ స్థానంలో ఉన్నాం. అందుబాటులో ఉన్న కోర్సులను విద్యార్థులు వినియోగించుకోవాలి.

– డాక్టర్ వేణుగోపాల్, ప్రిన్సిపల్, నగరి డిగ్రీకళాశాల



కెమిస్ట్రీ ల్యాబ్



జేకేసీ ల్యాబ్



సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి మంత్రి రోజా నుంచి ప్రశంసలు

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నగరి : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్వీపురం మండల పరిషత్ పాఠశాలను ఆమె సందర్శించారు. పిల్లలకు వడ్డిస్తున్న జగనన్న గోరుముద్దను పరిశీలించారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం అందించాలని వారికి సూచించారు. అనంతరం హెచ్‌ఎంతో మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి జరిగే సంగ్రహణాత్మక మదింపు–2 పరీక్షల నిర్వహణకు సంబంధించిన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని యాజమాన్య హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎస్‌ఈఆర్‌టీ వారు సూచించిన విధంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఎస్‌పీ–2 కాంప్లెక్స్ పరిధిలోని వారు హెచ్‌ఎంల వద్ద నుంచి పరీక్షకు ఒక గంట ముందు



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

ప్రశ్నాపత్రాలు తీసుకోవాలని సూచించారు. అలాగే 6 నుంచి 9వ తరగతి వరకు ప్రశ్నపత్రాలను ఎంఈఓ కార్యాలయంలో ప్రతిరోజు టైంటేబుల్ అనుసరించి ఒకగంట ముందుగా ప్రశ్నపత్రాలు తీసుకోవాలన్నారు. పరీక్షలు అనంతరం అన్ని పాఠశాల నుంచి ఓఎంఆర్ షీట్ ప్యాకెట్లను ఎంఈఓ కార్యాలయానికి చేర్చాలని సూచించారు.

భక్తాంజనేయస్వామికి విశేష పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేక పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆకుమాల, వడమాల సమర్పించి కర్పూరహారతులు ఇచ్చి పూజలు చేశారు. అనంతరం భక్తులు గోశాలలో గోపూజ చేశారు. గోమాతకు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం



కదిరిమంగళంలో పీపుల్స్ సర్వే నిర్వహిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ కరుణాకర్ చౌదరి



రాచపాలెంలో సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న డాక్టర్ కృష్ణమరాజు



తాటితోపు వీధిలో సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న వైస్ చైర్మన్ శంకర్

వడమాలపేట : రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని డీసీసీబీ డైరెక్టర్ కరుణాకర్ చౌదరి అన్నారు. మంగళవారం పాదిరేడు సచివాలయం పరిధిలోని కదిరిమంగళం, పూడి సచివాలయం పరిధిలోని వేమాపురం ఆదిఆంధ్రవాడ గ్రామంలో వలంటీర్లు, గృహసారథులతో కలిసి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా రూ.3 లక్షల మేర లబ్ధి చేకూర్చామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నవరత్నాలు అందించారని తెలిపారు. మహిళల పేరిట ఇళ్లు, ఇంటి పట్టాలు, ఆసరా, అమ్మ ఒడి వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. పర్యాటక శాఖ మంత్రి రోజా రాష్ట్రప్రభుత్వం అందించే పథకాలతో పాటు రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి పీపుల్స్ సర్వే నిర్వహిస్తూ, జగనన్న స్టిక్కర్‌ను అతికించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, నాయకులు యాదవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలనే మళ్లీ రావాలి

పుత్తూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనే మళ్లీ రావాలనే మాటే అందరి నోటా వినిపిస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ డి.శంకర్ తెలిపారు. మంగళవారం 8వ వార్డులో శంకర్, 27వ వార్డులో ఎస్.కృష్ణమరాజు, చంద్రశేఖర్‌రాజు ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నవరత్నాల పేరిట అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పట్ల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్లు ఎస్‌కేపీ బాబు, జయచంద్ర, గృహసారథులు ఉమాశంకర్, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో...

గంగాధరనెల్లూరు: మండలంలోని నెల్లేపల్లి గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ రవీంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ బేబి, వెంకటరెడ్డి, జయరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: మండలకేంద్రంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శివప్రకాష్ మొదలియార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు, స్థానిక సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబ సభ్యుల అనుమతితో ఇంటి గోడలపై



గంగాధరనెల్లూరు: సంక్షేమ పథకాలను వివరిస్తున్న మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి



కార్వేటినగరంలో..

మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో మండల మాజీ కన్వీనర్ ధనుంజయవర్మ, ధనశేఖర్ మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి జగన్.. సంక్షోభానికి చంద్రబాబు



పథకాల లబ్ధిని తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- పేదల స్థితిగతులను మార్చిన నేత సీఎం జగనన్న
- సారా తయారీని ప్రోత్సహించి అల్లర్లు సృష్టిస్తున్న టీడీపీ
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: సీఎం జగనన్న పాలనలో ప్రజలు సంక్షేమ పథకాలతో ఆనందంగా ఉంటే చంద్రబాబు పాలనలో సంక్షోభంతో అల్లాడిపోయారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. మంగళవారం మండలంలోని పాతగుంట గ్రామ సచివాలయ పరిధిలో అడపాలబైలు, కురివికుప్పం, కురివికుప్పం దళితవాడ, బందార్లపల్లె గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజరైన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి, ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలతో పేదల స్థితిగతులను మార్చిన వ్యక్తి సీఎం జగనన్న అని స్పష్టం చేశారు. కులమతాలకు అతీతంగా నేరుగా పేదవారికే న్యాయం జరగాలన్న తపనతో విప్లవాత్మక పథకాలకు శ్రీకారం చుట్టినట్టు గుర్తు చేశారు. గ్రామాల్లో కొందరిని తమవైపు తిప్పుకుని టీడీపీ నేతలు అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సీఎం జగనన్న పాలనలో వర్షాలు పుష్కలంగా కురిసి పాడిపంటలు సమృద్ధిగా ఉన్నాయని ప్రజలే చెబుతున్నారని తెలిపారు. అదే చంద్రబాబు వస్తే కరువు కాటకాలతో ఎడారిగా మారి ప్రజలు అలమటిస్తారని ఆయన ఆరోపించారు.

పెద్దకొడుకులా చూసుకుంటున్న జగన్..

అడపాలబైలు గ్రామంలో టీడీపీకి చెందిన సుజాతను సీఎం జగన్ ఏం చేశాడని అడగ్గా, నన్ను సీఎం జగన్ పెద్దకొడుకులా చూసుకుంటున్నాడని చెప్పిందని డిప్యూటీ సీఎం తెలిపారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని మంత్రి నారాయణస్వామి అన్నారు. అడపాలబైలు గ్రామంలో కొత్తగా ట్యాంకు నిర్మించి నీటిని అందించాలన్నారు. కురివికుప్పం దళితవాడలో డ్రైనేజీ కాలువ నిర్మాణం, రోడ్డు నిర్మాణ పనులకు చర్యలు తీసుకోవాలన్నారు. శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని తహసీల్దార్ పుల్లారెడ్డిని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు వెలుగు ద్వారా రుణాలు మంజూరు చేయాలని ఏపీఎం కవితను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, వైస్ ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, గృహసారథుల కన్వీనర్ బట్టే సుబ్రమణ్యం, ఎంపీడీఓ సుధాకరరావు, మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఏపీఓ ఇందు, విద్యుత్ ఏఈ రామాంజనేయులు, ఎంపీటీసీ చిన్నబ్బ, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, సర్పంచ్‌లు అబ్బులు రెడ్డి, గోవిందయ్య, శ్రీనాథరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిన్నబ్బ రెడ్డి, గోవిందన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పేట ధనంజయరెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, భీమశంకర్‌రెడ్డి, రాజారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మే 13న జాతీయ లోక్‌అదాలత్



జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు రూరల్: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో మే 13వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్ ద్వారా ప్రధానంగా రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో లేని ప్రీ లిటిగేషన్ కేసులను సైతం లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చన్నారు. నగదుతో పాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీమార్గమే సురక్షితం అన్నారు. న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని, తద్వారా పెద్దసంఖ్యలో కేసులు పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాతాశిశు మరణాల నియంత్రణపై అవగాహన

పాలసముద్రం : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే మాతాశిశు మరణాలు తగ్గించవచ్చని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆరోగ్య సిబ్బందికి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశీల, మురళి నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ గర్భిణులు పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు సహా మంచి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే అనుబంధ ఆహారం తీసుకోవాలని, ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేయించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత విపరీతంగా ఉన్నందున మజ్జిగ, పండ్ల రసం ఎక్కువగా తీసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు గొడుగు వినియోగించాలని తెలిపారు. గర్భిణులు రక్త పరీక్షలు చేసుకున్న తరువాతే నెలసరి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాతాశిశు మరణాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

భూబకాసురుల భరతం పడతాం

శ్రీరంగరాజపురం: రాత్రివేళల్లో భూ బకాసురులు రెచ్చిపోతున్నారని, వారిపై నిఘా ఉంచి భరతం పడతామని తహసీల్దార్ లోకనాథపిళ్లై హెచ్చరించారు. మెదవాడ ఎస్టీ కాలనీ చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములు, కాలువలను పూడ్చేస్తున్నారని తెలిపారు. అలాగే డీకేటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రాత్రివేళ కాలువలు, ప్రభుత్వ భూములను చదును చేస్తున్నారన్నారు. ఈ భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో వారు మంగళవారం పనులను అడ్డుకున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నట్లు తెలిసిన వెంటనే 9491077028 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఆయనతో పాటు ఆర్ఐ త్యాగరాజులు, వీఆర్ఓ మోహన, సర్వేయర్ సాగర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమానికి గురైన స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

చెవుటి గంగమ్మతల్లికి పాలాభిషేకం





ప్రత్యేక అలంకరణలో చెవుటి గంగమ్మ, అమ్మవారికి మొక్కులు తీర్చుకునేందుకు విచ్చేసిన భక్తులు

పాలసముద్రం : మండలంలోని కృష్ణజమ్మపురం పంచాయతీ బలిజకండ్రిగ గ్రామంలో వెలసిన చెవుటి గంగమ్మతల్లికి మంగళవారం పాలాభిషేకం, అంబలి పోసే కార్యక్రమం కోలాహలంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకుడు అమ్మవారి ఎదుట కలశం పెట్టి గణపతి హోమం, నవగ్రహ హోమం, శాంతి హోమం చేపట్టారు. హోమంలో ఉంచిన కలశ నీటితో అమ్మవారిని అభిషేకించారు. ఉదయం 10 గంటలకు ప్రతి ఇంటి నుంచి మహిళలు అంబలి, పాలు, పసుపు నీటి బిందెలతో మంగళ వాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా చేరుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులు తీసుకొచ్చిన పాలు, పసుపు నీటితో అమ్మవారిని అభిషేకించారు. కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున రావడంతో ఆలయం కిటకిటలాడింది. అభిషేకాలు పూర్తయిన తరువాత అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.